

**ఎవరి ప్రయోజనాల కోసం సదర్మాట్ తరలించారు** 

సదర్మాట్ మినీ బ్యారేజిని పొన్కల్‌కు ఎవరి ప్రయోజనాల కోసం తరలించారని ఆర్‌ఎస్. ప్రవీణ్‌కుమార్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

8లో▸



**మూగ జీవుల మృత్యుఘోష**

మూగ జీవుల మృత్యుఘోష సాగుతోంది. సాగు కోసమని అక్రమార్కులు వారసంతల్లో పశువులను కొనుగోలు చేస్తూ మంచిర్యాల మీదుగా అక్రమంగా తరలిస్తున్నారు.

10లో▸

గరిష్ఠం/కనిష్ఠం 34.2/16.3

**వాతావరణం**

వాతావరణం పొడిగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. మధ్యాహ్నం ఎండ ఎక్కువగా ఉంటుంది. ఉక్కపోత పెరుగుతుంది. రాత్రి చలి ప్రభావం తగ్గుతుంది.

# పదికి పది సాధించేలా..

- కొనసాగుతున్న ప్రత్యేక తరగతులు
- విద్యార్థుల ఆకలి తీర్చేలా అల్పాహారం
- ఇంటర్నల్ మార్కుల పరిశీలన మరూ..



ప్రత్యేక తరగతుల్లో అల్పాహారం చేస్తున్న విద్యార్థులు

**నిర్మల్ రూరల్/మామడ:** పదో తరగతి ఫలితాల్లో ఈ ఏడాది జిల్లాను రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలిపేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. విద్యార్థులను ప్రత్యేక ప్రణాళికతో చదివిస్తూ పరీక్షలకు సంసిద్ధులను చేస్తున్నారు. ఎక్కువ మంది 10 జీపీఏ సాధించేలా తర్ఫీదు ఇస్తున్నారు. విద్యాశాఖ ఉన్నతాధికారుల ఆదేశాలతో గత నవంబర్ నుంచి ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. విద్యార్థులు ఉదయం పాఠశాలకు వచ్చి, సాయంత్రం తరగతుల వరకు ఉండాల్సి రావడంతో ఆకలితో అలమటించేవారు. కొన్ని పాఠశాలల్లో దాతలు ముందుకు వచ్చి విద్యార్థులకు స్నాక్స్ అందిస్తున్నారు. ఈ క్రమంలో విద్యార్థుల ఇబ్బందులను గుర్తించిన ప్రభుత్వం విద్యార్థులకు సాయంత్రం అల్పాహారం అందించాలని నిర్ణయించింది. ఈమేరకు నిధులు విడుదల చేయడంతో ఈనెల 15 నుంచి సాయంత్రం స్నాక్స్ ఇస్తున్నారు. ఏప్రిల్ 1వ తేదీ వరకు అల్పాహారం అందిస్తారు. క్షుద్బాధ తీరడంతో విద్యార్థులు చదువుపై దృష్టిపెట్టనున్నారు.

**ప్రతీరోజు ప్రత్యేకం...**

జిల్లాలో ప్రభుత్వ, జిల్లా పరిషత్, మోడల్ స్కూల్ పాఠశాలలు కలిపి 117 ఉన్నాయి. ఇందులో 3,914 మంది విద్యార్థులు పదో తరగతి చదువుతున్నారు. ఒక్కో విద్యార్థికి రోజుకు రూ.15 అల్పాహారం కోసం వెచ్చిస్తున్నారు. ఒక రోజుకు జిల్లా వ్యాప్తంగా రూ.58,710 చొప్పున 34 రోజులకు రూ.19,96,140 నిధులు ప్రభుత్వం ఎస్‌ఎంసీ ఖాతాల్లో జమ చేసింది. మధ్యాహ్న భోజన ఏజెన్సీలు అల్పాహారం తయారు చేసి విద్యార్థులకు అందించే విధంగా ఏర్పాట్లు చేయాలని డీఈవో ప్రధానోపాధ్యాయుల కు ఆదేశాలు జారీ చేశారు. ప్రత్యేక తరగతులకు హాజరయ్యే విద్యార్థులకు ప్రతీరోజు అల్పాహారం అందిస్తున్నారు. సోమవారం రెండు సమోసాలు లేదా పకోడి బజ్జి, అరటిపండు, మంగళవారం అటుకుల చుడువా, అరటిపండు, బుధవారం ఉప్మా(సన్నని గోధుమ రవ్వ), అరటిపండు, గురువారం తడి అటుకులు, అరటిపండు, శుక్రవారం ఉడికించిన రెండు కోడిగుడ్లు, శనివారం ఉడికించిన శనగలు అందిస్తారు.

**రాష్ట్ర, జిల్లాస్థాయి బృందాలతో తనిఖీ..**

కొంతమంది ఉపాధ్యాయులు సరిగా బోధించడంలేదనే ఆరోపణల నేపథ్యంలో పాఠశాల విద్యాశాఖ రాష్ట్రస్థాయి, జిల్లా స్థాయి బృందాలను పర్యవేక్షణ కోసం నియమించింది. పదో తరగతి, తొలిమెట్టు కార్యక్రమాలను పర్యవేక్షించేందుకు రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ జిల్లా, రాష్ట్రస్థాయి బృందాలను ఏర్పాటు చేసింది. ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలకు సంబంధించి రెండు చొప్పున రాష్ట్రస్థాయి బృందాలను ఏర్పాటు చేశారు. ఈ బృందాల్లో ప్రధానోపాధ్యాయులు సభ్యులుగా ఉన్నారు. వారానికి రెండురోజులు తనిఖీలు చేస్తారు. పదో తరగతి సిలబస్ పూర్తయిందా.. లేదా.. ప్రత్యేక తరగతులు జరుగుతున్నాయా లేదా.. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ఏవిధంగా దృష్టి సారించారు.. విద్యార్థులకు స్నాక్స్ అందిస్తున్నారా.. లేదా.. అనే విషయాలపై ఆరా తీస్తారు. ఆ వివరాలను జిల్లా విద్యాశాఖ అధికారితోపాటు రాష్ట్రస్థాయి అధికా రులకు నివేదిక ఇస్తారు. రాష్ట్రస్థాయి బృందంతోపాటు జిల్లా స్థాయిలో మూడు బృందాలు ఏర్పాటు చేశారు. ఒక బృందంలో నలుగురు సభ్యులు ఉంటారు. ఇద్దరు ఉన్నత పాఠశాలలు, మరో ఇద్దరు ప్రాథమిక స్థాయిలో జరుగుతున్న తొలిమెట్టు కార్యక్రమాన్ని పరిశీలిస్తారు. ఒక్కో బృందం వారానికి రెండు రోజులు తనిఖీ చేస్తుంది. ఉపాధ్యాయులు విద్యాబోధ న చేపడుతున్నారా.. సక్రమంగా పాఠశాలకు వస్తున్నారా..లేదా.. అనే విషయాలపై ఆరా తీస్తారు.

**మొదలైన ఇంటర్నల్ మార్కుల పరిశీలన**

పదో తరగతి విద్యార్థుల ఇంటర్నల్ మార్కుల పరిశీలన, నమోదును ఈ నెల 16 నుంచి 21 చేయనున్నారు. ఇందుకు జిల్లాలో 27 బృందాలను ఏర్పాటు చేశారు. నాలుగు రోజులపాటు ఈ బృందాలు పాఠశాలలను సందర్శించి విద్యార్థుల ఇంటర్నల్ మార్కులు నమోదు చేస్తారు. ఈనెల 22 నుంచి 28 వరకు మొదటి ప్రీఫైనల్ పరీక్షలు, మార్చి 14 నుంచి రెండో ప్రీఫైనల్ పరీక్షలు నిర్వహిస్తారు. ఏప్రిల్ 3 నుంచి ఫైనల్ పరీక్షలు రాయనున్నారు.

**విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాలు**

పదో తరగతి చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించాలని విద్యాశాఖ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. రాత్రివేళ పిల్లలు చదువుతున్నారా? లేదా? అనే విషయాలపై ఆరా తీయాలని సూచించారు. తరచూ విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడాలని, తల్లిదండ్రులు విద్యార్థులకు తోడ్పాటునందించేలా చూడాలని పేర్కొంటున్నారు. ఉదయం పిల్లల్ని 5 నుంచి 6 గంటల మధ్యలో నిద్ర లేపి చదివించాలని సూచిస్తున్నారు. టీ–సాట్ ద్వారా వచ్చే తరగతులు చూసేలా చర్యలు తీసుకోవాలని చెబుతున్నారు. ఈనెల 20 నుంచి వచ్చే మార్చి 20 వరకు టీ–సాట్ ద్వారా ప్రత్యేక తరగతులు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరిస్తున్నారు.

**ఆకలి బాధ తీరుతోంది**



ప్రతీరోజు మాకు అల్పాహారం అందించడంతో ఆకలి బాధ తీరుతోంది. పోషక విలువలు ఉండే అల్పాహారం అందిస్తే బాగుంటుంది. ఉదయం సాయంత్రం వేళల్లో వేర్వేరుగా అల్పాహారం అందించాలి.

– భావన, పదో తరగతి

**చదువుపై ఆసక్తి..**



ప్రత్యేక తరగతుల కోసం ప్రతీరోజు ఉదయం 8:30 నుంచి సాయంత్రం 5:45 గంటల వరకు పాఠశాలలోనే ఉంటున్నాం. మాకు అల్పాహారం అందించడంతో ఆకలి తీరి చదువుపై మరింత ఆసక్తి పెరుగుతోంది.

– శ్రీజ, పదో తరగతి

**ప్రభుత్వానికి కృతజ్ఞతలు**



పదో తరగతి విద్యార్థుల ఆకలి తీర్చేందుకు అల్పాహారం అందిస్తున్నందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు. ఉపాధ్యాయులు కూడా తోడ్పాటు అందిస్తున్నారు. మెనూ ప్రకారం పుష్టికరమైన అల్పాహారం అందించాలి.

– మహేశ్, పదో తరగతి

**చదువుపై మరింత దృష్టి..**

పదో తరగతి విద్యార్థులను ప్రత్యేక ప్రణాళికతో చదివించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలి. పది విద్యార్థులకు మెనూ ప్రకారం అల్పాహారం అందించాలి. అల్పాహారం సమకూర్చడం ద్వారా విద్యార్థుల ఆకలి తీరి చదువుపై మరింత దృష్టి పెడతారు. 100 శాతం ఉత్తీర్ణతతోపాటు 10 జీపీఏ ఎక్కువ మంది సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలి.

– రవీందర్‌రెడ్డి, డీఈవో

## నిర్దేశిత లక్ష్యాలను పూర్తి చేయాలి

- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

**నిర్మల్‌చైన్‌గేట్:** నిర్దేశించిన ప్రభుత్వ లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అన్నారు. రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులతో కలిసి హైదరాబాద్ నుంచి కలెక్టర్లతో గురువారం వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. కంటి వెలుగు, పోడు భూములు, జీవోలు 58, 59, 76, 118 ప్రకారం చేయాల్సిన క్రమబద్ధీకరణ, తెలంగాణకు హరితహారం, డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణంపై సమీక్ష నిర్వహించారు. కంటి వెలుగు శిబిరాల నిర్వహణపై శ్రద్ధ వహించాలన్నారు. రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని శిబిరాల వద్ద చల్లని నీరు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. జిల్లాలకు ప్రిస్కిప్షన్ అద్దాలు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. ఫిబ్రవరి 26 నాటికి డబుల్ బెడ్రూం ఇళ్ల లబ్ధిదారులను ఎంపిక చేసి వివరాలు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని పేర్కొన్నారు. పోడు భూముల పట్టాల పంపిణీకి జిల్లాస్థాయి కమిటీ వద్ద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు త్వరగా ఆమోదించాలన్నారు. సరిగా ఉన్న దరఖాస్తులు వెంటనే పట్టా పాస్ పుస్తకాల ముద్రణకు పంపాలన్నారు. తెలంగాణకు హరితహారం కింద వచ్చే ఏడాది నాటేందుకు అవసరమైన మొక్కలు నర్సరీల్లో పెంచాలని సూచించారు. జిల్లాల్లో మొక్కలు నాటే స్థలాల గుర్తింపు, రిజిస్ట్రేషన్ వంటి అంశాలు పక్కాగా జరిగేలా ప్రణాళిక సిద్ధం చేయాలని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా జీవో 58 ప్రకారం ఆమోదించిన దరఖాస్తుదారుల పట్టాలను స్థానిక మంత్రి, ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో పంపిణీ చేయాలన్నారు. పెండింగ్ దరఖాస్తుల ధ్రువీకరణ పూర్తి చేయాలని, ఫీల్డ్ వెరిఫికేషన్ వంద శాతం పూర్తి కావాలని ఆదేశించారు. అనంతరం కలెక్టర్ వరుణ్‌రెడ్డి సంబంధిత అధికారులతో మాట్లాడారు. జీవో 58, 59, 76లకు సంబంధించిన దరఖాస్తులపై తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు చేశారు. వీడియో సమావేశంలో అదనపు కలెక్టర్ రాంబాబు, డీఎఫ్‌వో అనిల్, ఆర్డీవోలు స్రవంతి, రవికుమార్, డీఎంహెచ్‌వో ధన్‌రాజ్ పాల్గొన్నారు.

## న్యూస్‌రీల్

### ప్రాక్టికల్స్‌ను పరిశీలించిన డీఐఈవో



ప్రయోగ పరీక్షలను పరిశీలిస్తున్న పరశురాం

**సారంగాపూర్:** స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న ఇంటర్ ప్రయోగ పరీక్షలను డీఐఈవో జె.పరశురాం గురువారం పరిశీలించారు. విద్యార్థులు పరీక్షలు రాస్తున్న విధానం పరిశీలించి పలువురు విద్యార్థులతో మాట్లాడారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని ప్రిన్సిపాల్ మారుతికి సూచించారు. ఆయన వెంట లోకేశ్వరం ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ తుక్కారాం, కళాశాల సిబ్బంది ఉన్నారు.

**ఇంటర్ ప్రాక్టికల్స్‌కు 218 మంది గైర్హాజరు**

**నిర్మల్ రూరల్:** జిల్లాలో గురువారం జరిగిన ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలకు 218 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు జిల్లా ఇంటర్మీడియట్ అధికారి పరశురాం తెలిపారు. జనరల్ కేటగిరీలో మొత్తం 824 మంది విద్యార్థులకు 765 మంది హాజరయ్యారు. 59 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ కేటగిరీలో 571 మందికి 412 మంది హాజరుకాగా, 159 మంది గైర్హాజరయ్యారని తెలిపారు.

### ఇంటర్నల్ మార్కుల పరిశీలన



ఇంటర్నల్ మార్కులు పరిశీలిస్తున్న అధికారులు

**భైంసాటౌన్:** పట్టణంలోని సర్వేశ్వర్ విద్యామందిర్ పాఠశాలలో విద్యాశాఖ జిల్లా మానిటరింగ్ అధికారులు గురువారం ఇంటర్నల్ మార్కుల పరిశీలన చేపట్టారు. పదో తరగతి విద్యార్థులకు సంబంధించి సబ్జెక్టుల వారీగా నాలుగు నిర్మాణాత్మక మూల్యాంకనం మార్కుల కేటాయింపును పరిశీలించారు. మానిటరింగ్ అధికారులు విశ్వనాథ్, వినోద్‌కుమార్, గంగమోహన్, పాఠశాల హెచ్‌ఎం మందాడ పాల్గొన్నారు.


### దివ్యాంగ సంఘాల సమక్షంలో సదరం శిబిరాలు నిర్వహించాలి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న సట్టి సాయన్న

**నిర్మల్‌చైన్‌గేట్:** ఈనెల18, 23, 28 తేదీల్లో ఉపాధ్యాయ దివ్యాంగులకు నిర్వహించే సదరం శిబిరాలను దివ్యాంగ సంఘాల సమక్షంలో నిర్వహించాలని తెలంగాణ దివ్యాంగ పునరావాస అభివృద్ధి ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో కలెక్టర్ వరుణ్‌రెడ్డికి గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ దివ్యాంగ పునరావాస అభివృద్ధి ఆర్గనైజేషన్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు సట్టి సాయన్న మాట్లాడుతూ గతంలో కొంతమంది అనర్హులు దొడ్డిదారిన సదరం సర్టిఫికెట్ పొంది ఉద్యోగాలు పొందారని తెలిపారు. అలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా సంఘాల ఆధ్వర్యంలో శిబిరాలు నిర్వహించాలని కోరారు. ఆయన వెంట రాష్ట్ర ప్రధాన కార్యదర్శి క్రాంతికుమార్ ఉన్నారు.

### పోడు పట్టాలు ఇవ్వడంలో కేసీఆర్ విఫలం



మాట్లాడుతున్న నాయకులు

**ఖానాపూర్:** పేదలు సాగుచేసుకుంటున్న పోడు భూములకు పట్టాలివ్వడంలో సీఎం కేసీఆర్ పూర్తిగా విఫలమయ్యారని ఏఐకేఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జె.రాజు అన్నారు. పట్టణంలోని విశ్రాంతి భవనం ఆవరణలో గురువారం మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంవస్తే పోడు భూములకు పట్టాలొస్తాయని ఎదురుచూసిన రైతుల ఆశలకు ప్రభుత్వం గండికొడుతుందన్నారు. కేవలం ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని సర్వేల పేరుతో కాలయాపన చేస్తోందని విమర్శించారు. 2006 అటవీ హక్కుల చట్టం ప్రకారం ప్రతీ కుటుంబానికి 10 ఎకరాలకు పట్టాలివ్వాలన్నారు. అటవీ హక్కులను నిర్వీర్యం చేసి, కార్పొరేట్లకు అడవులను ధారాదత్తం చేసే 2022 అటవీ సంరక్షణ నియమాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈమేరకు అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రప్రభుత్వానికి పంపాలన్నారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు గోపి నర్సయ్య, జిల్లా సహాయ కార్యదర్శి మంచికంటి లక్ష్మణ్, జిల్లా నాయకులు సునారికారి రాజేశ్, నాయకులు అబ్దుల్, స్వామి, గంగన్న, ప్రసాద్, లింగన్న తదితరులు పాల్గొన్నారు.

# ఊరికో 'సంఘం'.!

- ఏర్పాటు యోచనలో కేంద్ర ప్రభుత్వం
- సహకారోద్యమం బలోపేతం దిశగా గ్రామానికో పీఏసీఎస్ ఏర్పాటుకు నిర్ణయం
- వచ్చే ఐదేళ్ల కాలంలో ప్రక్రియ పూర్తి!
- ఉమ్మడి జిల్లాలో ఇప్పటికే 77 సంఘాలు
- హర్షం వ్యక్తంచేస్తున్న సంఘాల సభ్యులు



ప్రాథమిక సహకార సంఘం కార్యాలయం

**సాక్షి, ఆదిలాబాద్:** గ్రామానికో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం యోచిస్తోంది. సహకారోద్యమాన్ని బలోపేతం చేసే దిశగా అడుగులు వేస్తోంది. ప్రస్తుతం రాష్ట్రంలో మండలానికి ఒకటి లేదా రెండు సంఘాలే ఉండగా వీటి సేవలను విస్తరించాలని భావిస్తోంది. ఢిల్లీలో బుధవారం కేంద్ర కేబినెట్ ఇందుకు సంబంధించి నిర్ణయం తీసుకుంది. రాబోయే ఐదేళ్లలో దేశంలో రెండు లక్షల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను ఏర్పాటు చేయాలని తీర్మానించింది.

**ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం ఇలా..**

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ప్రస్తుతం 77 పీఏసీఎస్‌లున్నాయి. వీటిలో లక్షకు పైగా సభ్యులున్నారు. 50వేలకు పైగా రుణాలు పొందే రైతులున్నారు. సహకార బ్యాంక్‌లు పీఏసీఎస్‌లకు ఫైనాన్స్ చేస్తున్నాయి. ఈ పీఏసీఎస్‌లు దాని నుంచి రైతులకు మార్జిన్‌పై రుణాలు అందిస్తున్నాయి. అంతేకాకుండా సంఘాల ద్వారా ఎరువులు సరఫరా చేస్తున్నాయి. నాఫెడ్, మార్క్‌ఫెడ్‌లకు అనుబంధంగా గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను నిర్వహిస్తున్నాయి. రైతులకు అవసరమయ్యే రీతిలో పీఏసీఎస్‌ల ద్వారా ఏదైనా పనిచేసుకునేందుకు ఆస్కారం ఉంటుంది. ఉదాహరణకు.. రైతుకు వ్యవసాయ పనుల్లో అవసరమయ్యే పనిముట్లను కూడా విక్రయించేందుకు అవకాశం ఉంది. మన దగ్గర మాత్రం ప్రధానంగా రుణాలు, ఎరువుల పంపిణీ, పంటల కొనుగోళ్లు మాత్రమే జరుగుతున్నాయి.

**అన్నదాతల్లో హర్షాతిరేకాలు**

2005లో వైద్యనాథ్ కమిటీ ఈ సహకార సంఘాల విషయంలో కొన్ని సూచనలు జారీ చేయగా అప్పట్లో నష్టాల్లో ఉన్న వీటిని పక్కనున్న ఇతర సంఘాల్లో కలిపారు. తద్వారా పీఏసీఎస్‌ల సంఖ్య తగ్గింది. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం మాత్రం మళ్లీ వీటి సంఖ్య పెంచాలనుకోవడం, గ్రామానికి ఒకటి చొప్పున ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో ముందుకు కదలడంపై రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

**సంఘాల ఆర్థిక స్థితి ఇలా..**

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో సహకార సంఘాల పరిస్థితిని పరిశీలిస్తే.. ఎక్కువ సంఘాలు రూ.10 కోట్ల నుంచి రూ.20 కోట్ల ఆర్థిక లావాదేవీల్లో ఉన్నాయి. ఓ ఐదు మాత్రం రూ.5కోట్ల లోపు ఉన్నాయి. తానూర్ సొసైటీ రూ.39 కోట్ల లావాదేవీలతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో అగ్రగామిగా ఉంది. నిర్మల్ రూ.29 కోట్లు, నేరడిగొండ, బోథ్ రూ.20 కోట్ల నుంచి రూ.25 కోట్ల మధ్య ఉన్నాయి. ఆదిలాబాద్ జిల్లా తలమడుగు సొసైటీ సూపర్ బజార్‌ను నిర్వహిస్తోంది. ఇలా వివిధ కార్యకలాపాల నిర్వహణ ద్వారా సంఘాలు ఆర్థికంగా పరిపుష్టి సాధిస్తున్నాయి. రానున్న రోజుల్లో గ్రామానికో సొసైటీ ఏర్పాటుతో తమకు మేలు జరుగుతుందన్న అభిప్రాయం రైతుల్లో వ్యక్తమవుతోంది. కేంద్ర ప్రభుత్వం ఇటీవల కేంద్ర సహకార మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసింది. ఆ తర్వాత దేశంలో సహకార సంఘాలను బలోపేతం చేయాలనే లక్ష్యంతో ముందుకు కదులుతోంది. అందులో భాగంగానే ఈ మార్పులకు సిద్ధమవుతోంది.

**విధివిధానాలు ఖరారు కాలేదు**



కొత్త పీఏసీఎస్‌లను ఏర్పాటు చేయాలని కేంద్రం ఉద్దేశంలో ఉంది. ఐదారు నెలల కిందటే ఈ ప్రక్రియ మొదలైంది. అయితే ఇప్పటికీ విధివిధానాలు ఖరారు కాలేదు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో రూ.3 కోట్ల నుంచి రూ.39 కోట్ల వరకు ఆర్థిక లావాదేవీలు నిర్వహిస్తున్న సొసైటీలున్నాయి.

– శ్రీధర్‌రెడ్డి, సీఈవో, డీసీసీ బ్యాంక్, ఆదిలాబాద్

# ఆలయాల అభివృద్ధికి పెద్దపీట



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న మంత్రి ఐకే రెడ్డి, నిజామాబాద్ ఎమ్మెల్యే గణేశ్‌గుప్తా తదితరులు

- తెలంగాణ పథకాలు దేశానికి ఆదర్శం
- మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

**కుంటాల:** ఆలయాల అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. ఓలా విఠలేశ్వర – రుక్మాబాయి స్థిర ప్రతిష్ఠాపన మహోత్సవాలు గురువారం ఘనంగా ముగిశాయి. చివరి రోజు వేద మూర్తులు భగవాన్ జోషి ఆధ్వర్యంలో శాంతి పఠనం, నిత్యపూజ, శిఖర స్థాపన, యంత్ర మూర్తి, స్థాన ప్రతిష్ఠ, దృగ్బలి, పూర్ణాహుతి, ప్రోక్షణ, అన్నదానం నిర్వహించారు. తన పుట్టిన రోజు సందర్భంగా మంత్రి స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం మాట్లాడారు తెలంగాణ ప్రభుత్వ పథకాలు దేశానికి ఆదర్శమన్నారు. కొండగట్టు ఆలయాభివద్ధికి సీఎం కేసీఆర్ రూ.600 కోట్లు మంజూరు చేయడం హర్షనీయమన్నారు. ఓలాలో విఠలేశ్వర – రుక్మాబాయి ఆలయానికి గందె పరివార్ కుటుంబ సభ్యులు రూ.60 లక్షలు వెచ్చించగా, దేవాదాయశాఖ నుంచి రూ.20 లక్షలు మంజూరు చేయించామన్నారు. ఇప్పటి వరకు ఆలయ అభివృద్ధికి రూ.1.25 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. అనంతరం కంటి వెలుగు శిబిరాన్ని సందర్శించారు. పదో తరగతి విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. సర్పంచ్ కనీస్‌ఫాతిమా, గ్రామస్తుల ఆధ్వర్యంలో తన పుట్టిన రోజు వేడుకలు జరుపుకున్నారు. కార్యక్రమంలో జెడ్పీచైర్మన్ విజయలక్ష్మి, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా, మేయర్ నీతు కిరణ్, మాజీ మేయర్ ఆకుల సుజాత, హుడా చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, పారిశ్రామిక వేత్త అల్లోల మురళీధర్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ సట్ల గజ్జారాం, మాజీ జెడ్పీ చైర్మన్ లోలం శ్యాంసుందర్, ఆలయ నిర్వాహకులు రాజ్‌కుమార్, నవీన్‌కుమార్, శివకుమార్, బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ దత్తు, ఐకేఆర్ పీఏ నలం శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

**ఆలయాలను పునర్నిర్మించుకున్నాం**



శిలాఫలకాన్ని ఆవిష్కరించిన మంత్రి

**నిర్మల్‌టౌన్:** నిర్మల్ నియోజకవర్గంలో ఎన్నో పురాతనమైన ఆలయాలను పునర్నిర్మించుకున్నామని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని బెస్తవార్‌పేట్‌లో నూతనంగా నిర్మించిన శివాలయంలో గురువారం విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించారు. మంత్రి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. శివాలయం నిర్మాణానికి రూ.25 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. గాంధీచౌక్‌లో హనుమాన్ మందిరం నిర్మించామన్నారు. బుధవార్‌పేట్‌లో శివకోటి ఆలయాన్ని అద్భుతంగా నిర్మించినట్లు పేర్కొన్నారు.

# క్రీడలతో మానసిక ఒత్తిడి దూరం



విజేతలకు ట్రోఫీ అందిస్తున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, కలెక్టర్ వరుణ్‌రెడ్డి, ఎస్పీ ప్రవీణ్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్

**నిర్మల్‌టౌన్:** క్రీడలతో మానసిక ఒత్తిడి దూరమవుతుందని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఎస్పీ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో నాలుగు రోజులు నిర్వహించిన జిల్లాస్థాయి వార్షిక స్పోర్ట్స్‌మీట్–2023 గురువారం ముగిసింది. ముగింపు కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం మంత్రి జన్మదినం సందర్భంగా కలెక్టర్ వరుణ్‌రెడ్డి, ఎస్పీ ప్రవీణ్‌కుమార్ కేక్ కట్ చేయించారు. ఈ సందర్భంగా ఐకేరెడ్డి మాట్లాడుతూ.. ప్రతీరోజు ఉద్యోగులు తీవ్ర ఒత్తిడితో విధులు నిర్వహిస్తారని, క్రీడల్లో పాల్గొంటే ఉపశమనం, ఉల్లాసం కలుగుతాయన్నారు. స్పోర్ట్స్‌మీట్‌లో జిల్లాలోని పోలీసులంతా ఒక దగ్గర కలుసుకునే అవకాశం కలిగిందన్నారు. భైంసా ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్, నిర్మల్ డీఎస్పీ జీవన్ రెడ్డి, పట్టణ సీఐ మల్లేశ్, జిల్లాలోని పోలీస్ అధికారులు, సిబ్బంది, అల్లోల గౌతమ్‌రెడ్డి పాల్గొన్నారు.

## పీఎస్బీతో డీఏపీ ఆదా



రైతులతో మాట్లాడుతున్న ఏడీవో అంజిప్రసాద్

**ముధోల్:** పాస్ఫరస్ సాల్యుబిలైజింగ్ బ్యాక్టీరియా (పీఎస్బీ)ని వాడడం వలన డీఏపీ ఎరువు ఆదా చేయవచ్చని జిల్లా వ్యవసాయాధికారి అంజిప్రసాద్ అన్నా రు. మండలంలోని ఎడ్‌బిడ్ గ్రామంలో జైపాల్‌రెడ్డి అనే రైతు పొలాన్ని జిల్లా వ్యవసాయాధికారి గురువారం పరిశీలించారు. పీఎస్బీ వాడకంతో రైతులు ఎకరానికి రూ. 1,450 పెట్టుబడి తగ్గుతుందని తెలిపారు. రైతులు విత్తనాలు వేసే ముందు లీటరు పీఎస్బీని ఇసుక లేదా పేడతో కలిపి వాడితే భూమిలో కుప్పలుగా ఉన్న కరగని భాస్వరం కరిగి మొక్కలకు అందుతుందని పేర్కొన్నారు. రైతులు ఖర్చు తగ్గించి ఆదాయం రెట్టింపు చేసుకోవచ్చని తెలిపారు. ఆయన వెంట ఏవో భాస్కర్, ఏఈవో శ్రీనివాస్, రైతులు ఉన్నారు.

## మాజీ ఎమ్మెల్యేతో ఐడీసీ చైర్మన్ భేటీ



వేణుగోపాలచారితో నారాయణ్‌రావ్‌పటేల్

**భైంసాటౌన్:** రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఎస్.వేణుగోపాలచారి ముధోల్ మాజీ ఎమ్మెల్యే బి.నారాయణ్‌రావ్ పటేల్‌ను గురువారం కలిశారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసానికి వెళ్లి ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, నియోజకవర్గంలో రాజకీయాలు, ఇతర అంశాలపై గంటన్నరకుపైగా చర్చించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే వేణుగోపాలచారిని సత్కరించారు.

## క్లుప్తంగా

### వ్యక్తి అదృశ్యం


నర్సయ్య (ఫైల్)

లోకేశ్వరం(ముథోల్): కొండగట్టు ఆంజనేయ స్వామిని దర్శించుకుని వస్తానని ఇంట్లో చెప్పి వెళ్లిన వ్యక్తి అదృశ్యమైనట్లు ఎస్సై సాయికుమార్ తెలిపారు. మండలంలోని పిప్రి గ్రామానికి చెందిన అనుగంటి నర్సయ్య కొండగట్టు ఆంజనేయ స్వామిని దర్శించుకుంటానని చెప్పి ఈ నెల 9న ఇంటినుంచి బయలుదేరాడు. వారం రోజులు కావస్తున్నా ఇంకా ఇంటికి తిరిగిరాకపోవడంతో కుటుంబ సభ్యులు కొండగట్టుకు సైతం వెళ్లి వెతికారు. అయినా ఆచూకీ లభించకపోవడంతో గురువారం నర్సయ్య భార్య రాధ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

### ఇసుక లారీల పట్టివేత


పోలీసులు పట్టుకున్న ఇసుక లారీ

మామడ(నిర్మల్): అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీలను పట్టుకున్నట్లు ఎస్సై అశోక్ తెలిపారు. గురువారం తెల్లవారు జామున మండలంలోని కమల్‌కోట్ గోదావరి నుంచి నిర్మల్ వైపు ఇసుక తరలిస్తున్న రెండు లారీలను పట్టుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.

### కారు చోరీ

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని టూటౌన్ పరిధిలో గల నీరటి వాడకు చెందిన షేక్ అహ్మద్ కారు చోరీకి గురైంది. ఈ నెల 10న రాత్రి ఇంటి ముందు పార్కింగ్ చేసిన వాహనం ఉదయం చూసే సరికి కనిపించకుండా పోయింది. దీంతో ఆయన చుట్టుపక్కల గాలించినా ఆచూకీ లభించకపోవడంతో గురువారం టూటౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభిస్తున్నట్లు ఎస్సై విష్ణుప్రకాశ్ తెలిపారు.

### కడుపునొప్పి భరించలేక వ్యక్తి ఆత్మహత్య

భైంసారూరల్(ముథోల్): పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని మిర్జాపూర్‌లో చోటు చేసుకున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. గ్రామానికి చెందిన షేక్ జావీద్ (36) కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. బుధవారం రాత్రి నొప్పి ఎక్కువ కావడంతో ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం భైంసా ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతు మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

### ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

నిర్మల్‌టౌన్: ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం నిర్మల్ రూరల్ మండలం తల్వేద గ్రామానికి చెందిన శ్రీనివాస్ (40)ప్రైవేట్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. హైదరాబాదులో శిక్షణ ఉందని కుటుంబ సభ్యులకు చెప్పి గురువారం ఇంట్లోంచి బయటకు వెళ్లాడు. జిల్లా కేంద్రంలోని శిల్పాగార్డెన్‌లో రేకుల షెడ్డుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు పట్టణ సీఐ మల్లేశ్ తెలిపారు.

### అనాథ శవానికి అంత్యక్రియలు

భైంసాటౌన్(ముథోల్): రెండు రోజుల క్రితం బాసర గోదావరి ఘాట్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభించిన విషయం తెలిసిందే. దీంతో కుటుంబీకులు, సంబంధీకులకు అప్పగించేందుకుగానూ మృతదేహాన్ని పోలీసులు భైంసాలోని ఏరియా ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం గదిలో భద్రపరిచారు. మృతుడి సంబంధీకులు ఎవరూ రాకపోవడంతో పాటు, మృతదేహం భద్రపరిచిన గది నుంచి దుర్వాసన వస్తుండడంతో గురువారం భైంసా మున్సిపల్ పారిశుధ్య సిబ్బంది సహకారంతో స్థానిక సుద్దవాగు సమీపంలో ఖననం చేశారు.

### వేధింపుల కేసులో నలుగురికి ఐదేళ్ల జైలు

నిర్మల్‌టౌన్: వేధించిన కేసులో నిర్మల్ న్యాయస్థానం నలుగురికి జైలుశిక్ష, జరిమానా విధించినట్లు కోర్టు సమన్వయల అధికారి సక్రీయ నాయక్ తెలిపారు. లోకేశ్వరం మండలంలోని నరసింహనగర్ తండాకు చెందిన పిట్ల గీత (24)కు నిర్మల్‌లోని వైఎస్సార్ కాలనీకి చెందిన రాజుతో 2018లో వివాహమైంది. దంపతులకు ఏడాది పాప ఉంది. రాజుతో పాటు అతని తల్లి భూమక్క, తండ్రి నాగయ్య, సోదరి నాగమణి గీతను మానసికంగా, శారీరకంగా వేధించేవారు. ఈ విషయంపై పెద్దల మధ్యలో పలుమారు పంచాయతీ పెట్టిన మార్పు రాలేదు. దీంతో బాధలు భరించలేక 2020 సెప్టెంబర్ 21న గీత చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి సోదరుడు వెంకటి నిర్మల్ రూరల్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా ఎస్సై ముతున్ కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. అనంతరం నేరస్తులను కోర్టులో హాజరు పరిచారు. పీపీ వినోద్ రావు 10 మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా నేరం రుజువు కావడంతో నలుగురు నిందితులకు ఐదేళ్ల జైలు, ఒక్కొక్కరికి రూ.వెయ్యి జరిమానా విధిస్తూ జిల్లా అసిస్టెంట్ సెషన్ జడ్జి అజేశ్‌కుమార్ గురువారం తీర్పుఇచ్చారు.

# క్రీడాకారులను ప్రోత్సహించడం అభినందనీయం


జూనియర్స్ విజేత ఎస్‌ఆర్‌ఆర్ జూనియర్ కళాశాల-మంచిర్యాల క్రికెట్ టీమ్‌కు బహుమతి ప్రదానం చేస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు


సీనియర్స్ విజేత వాగ్దేవి డిగ్రీ కళాశాల-మంచిర్యాల జట్టుకు బహుమతి ప్రదానం చేస్తున్న ఏసీపీ కిరణ్‌కుమార్, సాక్షి బృందం

- నిజామాబాద్ జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు
- ఎస్‌పీఎల్ సీనియర్స్ విజేత మంచిర్యాల వాగ్దేవి డిగ్రీ కళాశాల
- జూనియర్స్ విజేత మంచిర్యాల ఎస్ఆర్ఆర్

SPL SAKSHI PREMIER LEAGUE

SAKSHI సాక్షి సాక్షి SAKSHI TV SAKSHI DIGITAL MEDIA GROUP

నిజామాబాద్‌నాగారం: లక్ష్యాలను ఏర్పర్చుకుని క్రీడల్లో కఠోరంగా సాధన చేస్తే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని నిజామాబాద్ జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు అన్నారు. క్రీడాకారులను ప్రోత్సహించడానికి 'సాక్షి' మీడియా క్రికెట్ టోర్నమెంటు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. గురువారం నగరంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో 'సాక్షి' ప్రీమియర్ లీగ్ రీజినల్ క్రికెట్ టోర్నమెంటు ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు క్రీడలతోపాటు చదువును నిర్లక్ష్యం చేయొద్దని అన్నారు. నగర ఏసీపీ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో క్రీడలు చాలా అవసరమని, ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి తమవంతు బాధ్యతగా ఆడాలని అన్నారు. అనంతరం విజేతలకు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, ఏసీపీ కిరణ్‌కుమార్ ట్రోఫీలు అందజేశారు. కార్యక్రమంలో సుధాకర్ పైప్స్ సేల్స్ ఎగ్జిక్యూటీవ్స్ రాజేశ్, సురేశ్, 'సాక్షి' బ్రాంచ్ మేనేజర్ పల్లే మహేశ్, బ్యూరో ఇన్‌చార్జి తమ్మాటి భద్రారెడ్డి, సాక్షి ఈవెంట్స్ మేనేజర్ సుమన్, క్రికెట్ కోచ్ ఫారస్, గ్రౌండ్‌మన్ నారాయణ పాల్గొన్నారు. ఈ టోర్నమెంట్ విజేతలు రాష్ట్రస్థాయిలో పోటీల్లో పాల్గొంటారు.

**విజేతలు..**

సీనియర్ విభాగంలో మంచిర్యాల వాగ్దేవి డిగ్రీ కళాశాల, నిజామాబాద్ నిశిత డిగ్రీ కళాశాల జట్లు పోటీ పడ్డాయి. వాగ్దేవి డిగ్రీ కళాశాల జట్టు 12ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 99 పరుగులు చేసింది. అనంతరం నిశిత డిగ్రీ కళాశాల జట్టు ఏడు వికెట్ల నష్టానికి 93 పరుగులు చేసింది. ఆరు పరుగల తేడాతో వాగ్దేవి డిగ్రీ కళాశాల విజేతగా నిలువగా, నిజామాబాద్ నిశిత డిగ్రీ కళాశాల రన్నరప్‌గా నిలిచింది.

**జూనియర్స్‌లో..**

జూనియర్స్ విభాగంలో ఎస్ఆర్ఆర్ మంచిర్యాల కళాశాల, నిజామాబాద్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల జట్లు తలపడ్డాయి. ఎస్ఆర్ఆర్ కళాశాల జట్టు 12 ఓవర్లలో నాలుగు వికెట్ల నష్టానికి 104 పరుగులు చేసింది. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల జట్టు 12 ఓవర్లలో 65 పరుగులు చేసి ఆల్అవుట్ అయ్యింది. ఎస్ఆర్ఆర్ మంచిర్యాల కళాశాల జట్టులో సంతోష్ హ్యాట్రిక్‌తోపాటు మొత్తం 4 వికెట్లు తీసుకుని మ్యాచ్ విజయంలో కీలక పాత్ర పోషించాడు. అద్భుతమైన ఇన్నింగ్స్‌తో విన్నర్‌గా నిలిచింది.

## విదేశీ అతిథులు వచ్చాయి..!





మంచిర్యాల జిల్లా జన్నారం అడవులకు విదేశీ అతిథులు వచ్చాయి. యూరోప్ ఆస్ట్రేలియా దేశాల్లో నివసించే పక్షులు వలస వచ్చాయి. కవ్వాల్ టైగర్‌జోన్‌లోని జన్నారం అటవీ డివిజన్‌లో కల్పకుంట, బైసన్‌కుంట ప్రాంతాల్లో అరుదైన బ్లాక్‌స్టార్క్, నార్తర్న్ పెంటిల్స్ పక్షులు కనిపించినట్లు డిప్యూటీ కన్జర్వేటర్, జన్నారం ఎఫ్‌డీవో మాధవరావు తెలిపారు. ఇవి అరుదైన పక్షులని, ఇక్కడికి వలస వచ్చి వాటి సంతతిని పెంచుకుని తిరిగి వెళ్తాయని పేర్కొన్నారు. బ్లాక్‌స్టార్క్ పక్షులు అంతరించిపోయే పక్షుల్లో ఒకటని, అలాంటి పక్షులు ఇక్కడ కనిపించడం సంతోషకరమని అటవీ అధికారులు తెలిపారు. – జన్నారం

## పత్రాలు లేకుంటే 200 శాతం జరిమానా


సీజ్ చేసిన వాహనాలు

బోథ్: సరైన పత్రాలు లేకుండా రోడ్డుపై తిరుగుతున్న వాహన దారులు జరిమానా చెల్లించకుండా ఉంటే 200 శాతం జరిమానా కట్టాల్సి ఉంటుందని మోటార్ వెహికిల్ ఇన్స్‌పెక్టర్ హరీంద్రకుమార్ అన్నారు. గురువారం బోథ్ మండలంలో సరైన పత్రాలు లేకుండా తిరుగుతున్న 10 వాహనాలను సీజ్ చేసినట్లు ఆయన తెలిపారు. సకాలంలో జరిమానా చెల్లిస్తే 25 శాతం మాత్రమే చెల్లించే అవకాశం ఉందన్నారు. ఆర్టీఏ అధికారులకు చిక్కితే 200 శాతం జరిమానా చెల్లించాల్సి వస్తుందన్నారు. బోథ్‌లో 305, బజార్‌హత్నూర్‌లో 235, నేరడిగొండలో 246 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, యజమానులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

## మంత్రిని కలిసిన బాసర ఆలయ ఈవో


అమ్మవారి చిత్రపటం అందిస్తున్న ఈవో

భైంసా(ముథోల్): బాసర ఆలయ ఈవో విజయరామరాజుతో పాటు ఏఈవో సుదర్శన్ గౌడ్, ఆలయ అర్చకులు గురువారం రాష్ట్ర మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డిని కలిశారు. మంత్రి పుట్టిన రోజును పురస్కరించుకుని నిర్మల్‌లోని ఆయన నివాసంలో కలుసుకుని శుభాకాంక్షలు తెలిపారు. సరస్వతీ అమ్మవారి చిత్రపటం అందజేశారు.

# గిరిజన మత్స్యకారులకు నైపుణ్య శిక్షణ


శిక్షణ పొందిన సభ్యులతో అధికారులు

ఉట్నూర్‌రూరల్: మండలంలోని నర్సాపూర్ పంచాయతీ పరిధి గొట్టి చెరువులో గిరిజన మత్స్య సహకార సంఘాల సభ్యులకు గురువారం నైపుణ్య శిక్షణ ఇచ్చారు. కుమురంభీం ఆసిఫాబాద్, ఆదిలాబాద్ జిల్లాల మత్సశాఖ అధికారులు విజయ్‌కుమార్, సాంబశివరావు పరిశీలకులుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రాజెక్ట్ అధికారి ఆదేశాల మేరకు ఐటీడీఏ ఆధ్వర్యంలో గిరిజన మత్స్య సహకార సంఘాల సభ్యులకు ప్రత్యేక నైపుణ్య శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. నర్సాపూర్, గొట్టి, సాకెర, కేస్లాపూర్, సాలేగూడ, బలాన్‌పూర్, గుండాల, బాబేఝరి గ్రామాల నుంచి 190 మంది గిరిజన ఔత్సాహిక సభ్యులు నైపుణ్య పరీక్షకు హాజరైనట్లు పేర్కొన్నారు. కోఆపరేటివ్ అధికారులు బాషా, పేసా కోఆర్డినేటర్ వసంత్‌రావు, స్థానిక సర్పంచ్ పెందూర్ కళావతి పాల్గొన్నారు.

# పురుగుల మందు తాగి యువకుడు మృతి


రాకేశ్ మృతదేహం

పెంబి: పురుగుల మందు తాగి యువకుడు మృతి చెందిన సంఘటన పెంబి మండల కేంద్రంలో గురువారం చోటు చేసుకుంది. ఎస్సై రజినీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన గుమ్ముల లక్ష్మి, నర్సయ్య దంపతులకు ఇద్దరు కూతుర్లు, కుమారుడు ఉన్నారు. కుమారుడు రాకేశ్ (25)కు చిన్ననాటి నుంచి మతిస్థిమితం కోల్పోయాడు. తండ్రి పశువుల కాపరిగా పనిచేస్తున్నాడు. రోజులాగే గురువారం నర్సయ్య పశువులను మేపేందుకు వెళ్లగా ఇంట్లో ఎవరూలేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. చిన్న కూతురు చూసి స్థానికులకు తెలపడంతో ఖానాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందాడు. మృతిని తండ్రి నర్సయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

# వేధింపులకు గురిచేస్తే ఆత్మహత్య చేసుకుంటా..


పురుగుల మందు డబ్బాతో శరత్‌చంద్ర

కౌటాల: తనను వేధింపులకు గురిచేస్తే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంటానని మండలంలోని తాటినగర్‌కు చెందిన శరత్‌చంద్ర గురువారం సోషల్ మీడియాలో పోస్టుచేసిన వీడియో వైరల్‌గా మారింది. తనను కౌటాల తహసీల్దార్, పోలీసులు వేధింపులకు గురిచేస్తున్నారని అందులో పేర్కొన్నాడు. తహసీల్దార్ తనపై తప్పుడు ఆరోపణలు చేస్తూ పోలీస్ స్టేషన్‌లో కేసు పెట్టారన్నాడు. దీంతో పోలీసులు తనకు రోజు ఫోన్ చేసి తన ఆధార్‌కార్డు తీసుకొని రావాలని వేధింపులకు గురి చేస్తున్నారన్నాడు. తనపై అన్యాయంగా కేసులు బనాయించి జైలుకు పంపించే ప్రయత్నం చేస్తున్నారన్నాడు. తనకు ఏం జరిగినా ఆత్మహత్య చేసుకుంటానన్నారు. ఎస్పీ, కలెక్టర్ స్పందించి తనకు న్యాయం చేయాలని కోరారు. ఈ విషయమై ఎస్సై ప్రవీణ్‌కుమార్‌ను వివరణ కోరగా తన విధులకు ఆటంకం కలిగించడంతో పాటు తనపై అనుచిత వ్యాఖ్యలు చేసిన శరత్‌చంద్ర పై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ షరీఫ్ ఫిర్యాదు మేరకు ఈ నెల 8న అతనిపై కేసు నమోదు చేశామన్నారు. ఈ కేసు విషయంలో పోలీస్ స్టేషన్‌కు రావాలని ఫోన్ చేస్తే రావడం లేదన్నారు.

# ప్రశాంతంగా దేహదారుఢ్య పరీక్షలు


అభ్యర్థుల ఎత్తు పరిశీలిస్తున్న ఎస్పీ ఉదయ్‌కుమార్


లాంగ్‌జంప్ చేస్తున్న అభ్యర్థి

- రెండో రోజు 626 మంది హాజరు
- తుది రాత పరీక్షకు 279 మంది అర్హత
- పర్యవేక్షించిన ఆదిలాబాద్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: రెండో విడత ఎస్సై, పోలీసు కానిస్టేబుల్ శారీరక దేహదారుఢ్య పరీక్షలు రెండో రోజు గురువారం ప్రశాంతంగా జరిగాయి. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌లో ఎస్పీ డి.ఉదయ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో మహిళా అభ్యర్థులకు పరీక్షలు నిర్వహించారు. మహిళా అభ్యర్థులు ఉదయం ఈవెంట్స్‌కు హాజరయ్యారు. ఈ సందర్భంగా అధికారులు సర్టిఫికెట్లు పరిశీలించారు. బయోమెట్రిక్, రెస్ట్‌బ్యాండ్, ఆర్ఎఫ్ఐడీలను పూర్తి చేశారు. అనంతరం 800 మీటర్ల పరుగు పందెం నిర్వహించారు. ఇందులో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు 4 మీటర్ల షార్ట్‌పుట్, 2.5 మీటర్ల లాంగ్ జంప్ అంశాల్లో పరీక్షలు నిర్వహించారు. సీసీ టీవీ నిఘాలో ఈ పరీక్షలు జరిగాయి. 772 మంది హాజరుకావాల్సి ఉండగా 626 మంది హాజరయ్యారు. 46 మంది గైర్హాజరయ్యారు. 279 మంది అన్ని పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి రాత పరీక్షకు అర్హత సాధించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు శ్రీనివాస్‌రావు, రాములు నాయక్, సమయ్‌జాన్‌రావు, డీఎస్పీలు ఆర్.వెంకటేశ్వర్లు, ఉమేందర్, నాగేందర్, ఉమామహేశ్వర్‌రావు, పోతారం శ్రీనివాస్, ఏఓ యూసుఫ్ అలీ, తదితరులు పాల్గొన్నారు.

# వేతనాల్లో కోత విధిస్తే క్రిమినల్ కేసులు

- రిమ్స్‌లో మౌలిక వసతులు కల్పిస్తాం
- డీఎంఈ డాక్టర్ రమేశ్‌రెడ్డి


రిమ్స్ డైరెక్టర్‌ను ఆదేశిస్తున్న డీఎంఈ రమేశ్‌రెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్‌లో పనిచేస్తున్న కార్మికుల వేతనాల్లో కోత విధిస్తే సహించేది లేదని, అలాంటి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తామని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) డాక్టర్ కె.రమేశ్‌రెడ్డి అన్నారు. గురువారం రాత్రి జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రిని తనిఖీ చేసి పలు వార్డులను పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్య సేవల గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 1,400 వైద్యపోస్టులను పక్షం రోజుల్లో భర్తీ చేసేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. రిమ్స్ సూపర్ స్పెషాలిటీతో పాటు రిమ్స్ ఆస్పత్రిలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేస్తామన్నారు. ఎంఆర్ఐ యంత్రాన్ని త్వరలోనే ఏర్పాటు చేస్తామన్నారు. రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నామని, విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించే వైద్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సీసీ కెమెరాలు, బయోమెట్రిక్‌ను డీఎంఈ కార్యాలయానికి అనుసంధానం చేసి పర్యవేక్షిస్తామన్నారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిని సహించబోమని స్పష్టం చేశారు. కాంట్రాక్ట్ కార్మికులు తమకు కాంట్రాక్టర్ నెలకు రూ.13వేల వేతనం ఇస్తున్నారని డీఎంఈ దృష్టికి తీసుకువచ్చారు. రూ.15,600 ఇవ్వాల్సి ఉండగా రూ.2,600 కోత విధిస్తున్నారని, ఖాతాలో రూ.11వేలు జమ చేస్తూ రూ.2వేలు పీఎఫ్ కింద జమ చేస్తున్నారన్నారు. కాంట్రాక్టర్లకు షోకాజు నోటీసులు అందజేసి వారిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని రిమ్స్ డైరెక్టర్‌ను ఆదేశించారు. వారికి 5శాతం కమీషన్ టెండర్ ప్రకారం అందించడం జరుగుతుందని, నిబంధనలను ఉల్లంఘిస్తే టర్మినెట్ చేసి కొత్త టెండర్లు పిలవాలన్నారు. కార్మికుల పొట్టగొడితే ఊరుకోబోమని హెచ్చరించారు. ఆర్ఎంఓలు, సూపరింటెండెంట్ ప్రతిరోజు పర్యవేక్షించి రోగులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. కంటి వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆయన వెంట రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, సూపరింటెండెంట్ అశోక్, వైద్యులు ఇద్రిస్ అక్బాని, సుమలత, శ్యామ్‌ప్రసాద్, శిరీష్, తదితరులు ఉన్నారు.

# ఎవరి ప్రయోజనాల కోసం సదర్మాట్ తరలించారు


సదర్మాట్‌ను పరిశీలిస్తున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

ఖానాపూర్: మేడంపల్లిలో నిర్మించాల్సిన సదర్‌మాట్ మినీ బ్యారేజిని పొన్కల్‌కు ఎవరి ప్రయోజనాల కోసం తరలించారో చెప్పాలని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. బహుజన రాజ్యాధికార యాత్రలో భాగంగా గురువారం మండలంలోని సదర్మాట్ ఆనకట్టను సందర్శించి మాట్లాడారు. ఖానాపూర్ బ్యారేజీ తరలింపునకు బాధ్యులైన మంత్రి, సీఎం కేసీఆర్ ఖానాపూర్ ప్రజలకు క్షమాపణ చెప్పాలన్నారు.

**కాళేశ్వరం ప్రాజెక్టును పంజాబ్ సీఎంకు చూపాలి..**

పంజాబ్ సీఎంను తెచ్చి కొండపోచమ్మ ప్రాజెక్టు, ఎర్రవల్లిని చూపెట్టిన సీఎం కేసీఆర్ వరదల్లో మునిగిన కాళేశ్వరం ప్రాజెక్టును కూడా చూపించాలని ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. రాష్ట్రంలోని 4 కోట్ల ప్రజలకు కూడా వాటిని చూపెట్టాలన్నారు. అనంతరం మండలంలోని బాదన్‌కూర్తితో పాటు కొత్తపేట్ గ్రామాల్లో పార్టీ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు యువకులు బీఎస్పీలో చేరారు. నాయకులు జగన్‌మోహన్, బన్సీలాల్ రాథోడ్, ఎస్కే లక్ష్మి, గుండా సతీశ్, కుక్కరికారి రాజేశ్, హారతి తదితరులు ఉన్నారు.

**కడెం రైతాంగాన్ని పట్టించుకోని ప్రభుత్వం**

కడెం: గతేడాది భారీ వరదలతో కడెం ప్రాజెక్టుకు భారీ విపత్తు సంభవించినా ఆయకట్టు రైతాంగాన్ని రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోలేదని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. కడెం మండలంలోని లింగాపూర్‌లో శిథిలావస్థకు చేరిన ప్రభుత్వ పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం కడెం ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించారు. గతేడాది కడెం ప్రాజెక్టుకు వచ్చిన భారీ వరదలతో ఆయకట్టు అల్లకల్లోలమైనా సీఎం రాకపోవడం సిగ్గుచేటన్నారు. వరదలతో భూములు, పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం అందించలేకపోవడం దురదృష్టకరమన్నారు. అనంతరం పాత మద్దిపడగలో పర్యటించారు.

**గల్ఫ్ కార్మికులను మోసం చేశారు**

గల్ఫ్ కార్మికుల సంక్షేమ కోసం రూ.500 కోట్లు కేటాయిస్తామని హామీ ఇచ్చిన సీఎం కేసీఆర్ మాట తప్పారని, బహుజన రాజ్యంలో గల్ఫ్ కార్మికుల సంక్షేమం కోసం రూ.5వేల కోట్లు కేటాయిస్తామన్నారు.

## నవోదయలో ప్రవేశానికి 5,920 దరఖాస్తులు

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని జవహర్ నవోదయ విద్యాలయంలో 2023–24 విద్యాసంవత్సరానికి గానూ ఆరోతరగతిలో ప్రవేశానికి నిర్వహించనున్న పరీక్షకు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ఈ నెల 15తో ముగిసిందని పాఠశాల ప్రిన్సిపాల్ చక్రపాణి తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలోని ఆదిలాబాద్ నుంచి 1,378, నిర్మల్ జిల్లా నుంచి 1,589, మంచిర్యాల జిల్లా నుంచి 1,526, కుమురంభీం ఆసిఫాబాద్ నుంచి 1,427 మంది మొత్తం 5,920 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.

## మేకల దొంగలను పట్టుకున్న గ్రామస్తులు


గ్రామస్తులకు పట్టుబడిన దొంగలు

భైంసా(ముథోల్): మేకలను దొంగిలించి ఆటోలో తరలిస్తుండగా గమనించిన గ్రామస్తులు దొంగలను పట్టుకుని పోలీసులకు అప్పగించారు. మండల కేంద్రమైన బాసరలో వారంరోజులుగా మేకలు దొంగతనానికి గురవుతున్నాయి. గురువారం సైతం దొంగలు మేకలను దొంగిలించి త రలిస్తుండగా గ్రామస్తులు అడ్డుకున్నారు.

## మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య

నర్సాపూర్(జి): మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని తిమ్మాపూర్(జి) గ్రామానికి చెందిన తేలు రాములు(44) అప్పుల బాధ భరించలేక ఇటీవల మద్యానికి బానిసయ్యాడు. గురువారం తన వ్యవసాయ క్షేత్రంలోని వేప చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో మృతదేహాన్ని ఆటోలో నిర్మల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుని భార్య తేలు సులోచన ఫిర్యాదు మేరకు కేసుదర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్ఐ మాన్‌సింగ్, కానిస్టేబుల్ మహేందర్ తెలిపారు.